# ఇంటివిషయాలు

వెంపటి నాగభూషణంగారు

## ౧

చిన్నీ...చిన్నీ...

ఓ. వొస్తున్నా.

ఎక్కడ... వస్తావు, ఆయుర్దాయం మూడే లోపల.

అబ్బ, వొస్తున్నానండీ. అప్పుడే మొదలు. ఇంటికి రావడం భయంగద !...

అయితే ఏం చెయ్య మంటావు. ఇంటికి రాకుండాను, సీకంటికి కనపడకుండాను ఊడ్చిపెట్టుకుని ఉప్పినీళ్లు చల్లుకొని పొమ్మంటావా ఏమిటి, ఖర్మం?

అబ్బ. ఎందుకండీ, అంతవిసవిస. ఇంటివల్లగడప ఎక్కేసరికి, నా ముఖం చూచేసరికినా ఏమిటి? తల దువ్వుకుంటూ :టిని. చేతులో జడవున్నదామె. వస్తున్నా నంటిని. దానమ్మకడుపు బంగారంగాను, అప్పుడే యింత నాటకమా. ఇల్లాగైతే బయ టెట్లా నెగ్గుకొస్తారు బాబు...?

ఇంకా యేం. మాట లున్నాయి కోటలు దాటేటట్లు. పనిశూన్యం...... ఇదిగో యీ ఉత్తరియ్యం తీసుకు వెళ్లి, మంచిసీళ్లు పట్టుకు రా. త్వరగా వెళ్లాలి...

అయితే మంచినీళ్లు ఉత్తరియ్యంతో పట్టుకు రమ్మనా యేం, మీఅభిప్రాయం?

చాల్లే. తెలివికి సంతోషించా గాని, త్వరగా తీసుకు రా? పోవాలి.

ఏమో, కవులుగా. మీ చమత్కారాలు నాకర్థం కావద్దూ?

రొంబ ఆనందం గాని... తీసుకు రా. వెళ్లాలి. అతను వచ్చేవేళకూడా అయింది.

ఎవరు, శర్మేనా? మిమ్మల్ని పట్టుకు వేళ్లాడ్డంతప్ప అతనికి వేరే పనేమీలేదూ?

అబ్బ. ఊరుకుంటూ. వాక్చాపల్యం జాస్తి. అతను వింటే ఏమనుకొంటాడు. ఏదో అట్లా ఉంటూంటాయి కొన్ని ఘటాలు.

ఏమనుకుంటా డేం. శనిగ్రహంలాగు అన్నిటికీ తయారు. అయినప్పుడూ, లే నప్పుడూ టీ, కాఫీ చెయ్యలేక రామూ (వంటవాడు) మచ్చ మాస్తోంది. మీకూ ఊర్కోరామె.

పోనిస్తూ, చిన్నీ,...అదేమిటి జడ వొదులుగా వేశావేం.

అది అంతేలెండి. మాడర్న ఫేషన్.

సరే, అయితే. నాకు చదువు చెప్పేటట్టున్నావు చూస్తే. అదిగో అతను వస్తున్నాడు. నేను పోతున్నా.

పెందరాడే వస్తారుకదూ?

నువ్వు అడగాలీ? బయట అంతసే పుంటే నాకు మాత్రం ప్రాణం నిలుస్తుందీ.

ఓ చెంప అతను వింటున్నాడు. ఏమిటి ఊర్కే.

ఎబ్బే. ఏముంది. నిజమేగా చెప్పింది. పోతున్నా, గుడ్ యీవెనింగ్.

## ౨

ఆబట్ట కాకపోతే మరొకటి కట్టుకోకూడదూ. అంచంతా వెలిసి అసహ్యంగా ఉన్నది.

తమ పుట్టింటివా రిచ్చిందేనండి, ఇంతలక్షణం గా ఉన్నది. మొన్న నే నాన్పింది. ఇది రెండో ఉతుకు.

అదీ. ఎప్పుడూ వాళ్ల మీద సొడ్లు వెతకడం సరి పోతోంది. ఏదో శక్తి ఉన్నంతవరకు ఇచ్చారు. ఇచ్చిందానికి తృప్తిపడకూడదూ?

ఆహా. ఇచ్చారు. కట్టుకోలేక, ఉపయోగించు కోలేక ప్రాణం విసుగుతోంది. పెళ్లినాటివి, కాళ్లుకడుగుపళ్లెం, ముఖంకడుగుకుర్చీ ఇప్పటికి బాకీ. లిమిటేషన్ పట్టిపోయింది కూడాను. ఇచ్చినబట్టలు సరే గదా, ఇంత మహాయోగ్యం గానూ, లక్షణంగాను ఉన్నాయి.

అబ్బ! పోనిస్తురూ. మనకు ఒకరు పెట్టే దేమిటి. మన కున్నది చాలదూ?

ఉన్నదంతా కట్టుకుపోతారా యేం. సగం యిట్లా పడవెయ్యరాదూ?

ఇంతకూ అది. సగం మన కివ్వడ మేం, వాళ్లు అనుభవించలేరూ?

అదీ,అట్లా వెనక వేసుకు రా. ఎక్కడికి పోతుంది అభిమానం. ఈమాటు దీపావళికి పట్టుబట్ట లిస్తేనే గాని రానని చెప్పు.

పోనీండి పోకపోతే నేం. వాళ్లకే నయం. అయినా నే నెందుకు మధ్య సారథ్యం. మీరే చెప్పండి మామగారితో...

ఏమో, ఆయనయెత్తుకు నేను...

ఊహుఁ, ఏమి టామాటలు. అక్కడ నుంచి తెచ్చుకొనేవి తెచ్చుకోవడము, పైగా ఎత్తి పొడవడము. మామూలేగా అల్లుళ్లందరికీ...

ఈలా సద్దుకు రావడం కూతుళ్లకుగూడా మా మూలేగా. మొత్తానికి మాట మీద ఉంచు కోరు, పాపం.

## ౩

ఏమండీ; ఊఁ, ఏమండీ—

ఆఁ. ఏమిటీ?

ఏమంటారు, ఏమండీ.

అబ్బ! ప్రాణం తియ్యి. దేనికి?

ఈపూట వెడదామూ!

కొంప మునిగింది. ఎక్కడికి?

సినీమాకండీ. అది నాచేత అనిపించాలి.

ఏమిటి ఫిలిం, యివ్వాళ.

"చంద్రముఖి"—గోహార్ ఫిలిమండీ.

సాహోమె. నాకంటె ఎక్కువ తెలుసామె. ఏం బాగుంటుంది. గోహార్ ఫిలిం. కులకడం, తిప్పు కోడం, నవ్వడం తప్ప ఏముంటుంది?

గోహార్ బాగుండకపోవాలి. నవ్వీపోతారు ఎవ రైనా వింటే. ఏముంది, అర్థం కాకపోతే సరి. ముందు ఏదెట్లా వున్నా, పర్యవసానం అనుభ వించేవాణ్ణి నేను.

ఏం అనుభవిస్తున్నారండీ బాబూ, యిన్నాళ్ల నుంచీ. లేనిపోనిమాట అనడ మంటే, మహా సరదా.

అవును. లేనిపోనివి కాదు, మరి. ఫిలిం చూచి రావడం, ఆచమత్కారాలన్నీ ఇంట్లో ప్రయోగించడమూను ప్రాలంబికం పైన వేసి, సిగచుట్టూ గంపెడుపూలు దోపి, గోహర్‌లాగా కులకడం; నడవడం, కదలకపోవడం.

ఇంతేగద. పోనీండి మీకేం కష్టం యిందులో.

కష్టమా, అంతా నాదే. ఫిలింలో నాయకుడల్లే నన్నుగూడా ప్రవర్తించమని నిర్బంధనాయె. అట్లా సూటు వేసుకుని, అట్లా నవ్వుతూ, అట్లా కారెక్కి తిరుగుతూ, అట్లా చుంబనం చేస్తూ కాలం గడపమంటావు. ఎల్లా చెప్పు.

ఏమిటండీ, అబ్బ. ఎప్పుడో ఒకసారి తమాషాకు అంటే దాన్నే పట్టుకు వేళ్లాడుతారు. అవును నే నేం జేసినా అంతే... మొన్నేగా మీరు రాత్రి పద్యాలువ్రాసుకుంటూ — "చిన్నీ, లారాకు మల్లే నన్ను ఉత్సాహపరచాలి" అని, కళ్లలోకి నిద్ర కూకకు వస్తున్నా పద్యాలు వరుసగా చదివి వినిపించి తీరారు. అవును. ఎవరు చేసినవి వారికి జ్ఞాపక ముండవు. ఎందుకు లెండి.

సరే, గునుసు ప్రారంభించక. బయల్దేరు త్వరగా.

ఎందుకు, ఇంత నిష్ఠూర్యంగా?

ఊఁ, బయల్దేరు త్వరితం. నవర తియ్యలేను మాటిమాటికి.

సరే నేను సిద్ధం.

అయితే, అదే నేమిటి చీరె. దరిద్రం ఓడుతూండాలి. ఎన్ని ఉన్నా అంతే.

దీని కేమండీ నిక్షేపంలా గున్నది. నాలుగు పెళ్లిళ్లు చేయించవచ్చు. కొర్నాడచీర. తీసిపోయిందా యేమండీ?

సిల్కు ఊదాచీరె ఏమైంది? అది కట్టుకుని రోజా క్రేప్ రవికె తొడుక్కో త్వరగా కానీ.

ఇల్లా చెప్పి రేపెట్టేదిన్నీ, పైగా నన్నే దీని. ఎందుకు లెండి. ఇంతకు యింతా........

అనుభవిస్తానంటావా? సరేగాని బ్రూచ్ ఏదీ? కాళ్లకు స్లిప్పర్సు ఏవి! అతురమతురం చెప్పాలిసి ఉండె. మళ్లీ అన్నీ తెలుసునని భేషజం.

ఇప్పుడు స్లిప్పర్సుగూడా ఎందుకు పోనిస్తురూ.

కొనిపెట్టిందాకా ప్రాణాలు తోడేశావు. ఇప్పుడు మొహమాటం...తొడుక్కో. వేషం పూర్తికావద్దూ.

ముందు మాకంటికి నచ్చాలిసుండె. సినీ గాలో వేషం వేసేవాళ్లకన్న మనకు ఎక్కువ అలంకారాలు కావాలాయె. చెప్తే వినడమా, ఏమన్నా నా...

సరే, నడు. పుణ్యకాలం కాస్తా దాటుతోంది.

ఊఁ. పద.

౪

అయితే, చిన్నీ, ఎంత సేపట్లో వస్తా వన్నమాట?

ఎంతో సేపా ఒక అరగంట.

అరగంటంటే మనలెక్క ప్రకారం ఆరునెల లేగా.

అబ్బే. ఈవేళ చూడండి. సరిగ్గా అరగంట.

సరే, యిదివర కెన్నిసార్లు అయింది. చూసి చూసి కళ్లు బొత్త లడ్డాయి......అయితే ఇంజనీరు గారింట్లో ఏమిటీదినం.

వాళ్ల అబ్బాయికి ముద్దగొడుగులు యిస్తారు.

ఇంకా యిట్లాంటి అలవాట్లు పోలేదూ!

ఏంచిత్రమండీ. మన దంతా తల్లక్రిందులు పద్ధతేగా.

పుట్టెత్తమంటే పూర్వోత్తరాలు యెత్తుతావు, చిన్నీ. ఎరక్కపోయి అన్నాగాని, నీత్రోవని నీ వెళ్లు.

వచ్చిందాకా కాస్తవాకిలి చూస్తూండండి. రాముూమీద యిల్లు విడిచి పోకండి.

ఇలాగ పట్టింది ఖర్మం. నువ్వు తిరిగి వేంచేసే వరకూ ఇల్లు కాపలా కాయనా, జాతికుక్కల్లే? బాగానే వుంది అదృష్టం.

పోనీ లెండి, పేరంటం మానేస్తాను. ఎప్పుడూ నేను తల్చుకున్నదానికే గా విఘ్నం. ఛీ.

వెళ్లవమ్మా, వెళ్లు. పొరబాటు......చూడు, అయితే పైరోబోలకు లేని—పెట్టుకోలేదేం?

మళ్లీ మొదలు...ఏమో యెక్కడో వున్నాయి; తీయలేక బద్ధకించాను. ఈమారు పెట్టుకుంటూ లేస్తురూ.

వీల్లేదు. ముందు పెట్టుకో. కావాలని ఎంతో ప్రయత్నం జేసి తెప్పిస్తే ఉపయోగించడం తెలియదామె.

పోనీలెస్తురూ. ఏదో పిచ్చో, వెర్రో యిల్లాగ వుణ్ణీండి.అయినా నాకీఫురమాయింపు లేమిటి? మచ్చ మాపేస్తున్నారు మీఫేషన్లతోను, సలహాలతోను

వొప్పకోను. నీకేం తెలుసు. ఆలోలకులతో నీకు జుబేడా రూపు వస్తుంది.

జుబేడా కాదు,సుల్తానా. నా మొహం, ఇహ లాభం లేదు. ఎవరో ఒకరికైనా వుండాలి...

చూడు అదిగో, నే చెప్పింది అబద్ధమా.ఎలాగ మెరుస్తున్నయో. సరిగ్గా జుబేడా. ఇల్లా రా—

ఎట్లాగైతే నేం, పంతం నెగ్గిందిగా. ఆనందించండి. వెడ్తున్నాను,ఆలస్య మైంది యిప్పటికే.

ఒక్కమాట......

తిరిగి వచ్చిన తర్వాత......

౫

ఏమండీ, ఇట్లా ఒకసారి వస్తారూ?......అబ్బ మాట్లాడ రేమండీ. పదిసార్లు పిలిచినా పలుకే లేదామె...బ్రహ్మ వ్రాత, నా ప్రాణానికి వచ్చింది. ఇరవైనాలుగు గంటలు వ్రాతే నామె. ఇవతలవాళ్లు ఏమైనా సరే...

ఏమిటీ అతిశ్రవణం. నావ్రాతకోతల మాట గూడా నీ కెందుకు?

నా కెందు కేమిటి? తలప్రాణం తోక కొస్తోంది. ఇంత నిర్లక్ష్యమైతే యెల్లా. ఇవతలమనిషి ప్రాణం పోయినా అంతే.

అదే తలనొప్పి. ఊర్కే అయినదానికి కానిదానికకూడా చాటెత్తి చెరగడం. పోనీ ఏదో

యథాలోపాన వున్నానేమో అనుకొని ఆగకూడదా, లేక అంత తొందర వుంటే దగ్గరకు వచ్చి చెప్పకూడదా. అదీ గాక యిదీ గాక ఎక్కడనుంచో—ఏమండోయి, ఓహో, చూడండి, మిమ్మన్నే—అని సోమిదేవమ్మ గారి ఫక్కీగా పిలుస్తే, ఏం తెలుస్తుంది? నువ్వు మాత్రం నే పిల్చిన పదిఘుడియల దాకా నోరు తెరవకుండా, తరువాత, "వస్తున్నా; జడ వేసుకుంటున్నా ; చీర కట్టుకుంటున్నా; బొట్టు పెట్టుకుంటున్నా" అంటూ జామున్నర ఆలస్యం చేసినా ఫరవా లేదు. ఏం?

ఈ పనస, ప్రవర అయ్యేసరికి యీ టీ కాస్తా చల్లబడిపోయింది. అరగంట అయింది రామూ టీ తయారుజేసి.

పోనీ, ఆ విషయం తెలిసేటట్టు చెప్పగూడదూ? టీ కోసమంటే పరుగెట్టుకొని రాకపోదునా?

అవును. దానియందున్న లక్ష్యం నాయందుంటేనా?

ఉన్నది చాలదూ? దాసోహం అనమంటావా ఏమిటి?

ఆపాపం నా కెందుకు గానీండి. ఏమిటా వ్రాసేది.

నే వ్రాసే దేమిటో నీకు తెలియదూ?

కథా, పద్యమా?

రెండూను: ఒకదానితర్వాత ఒకటి.

ఏం విసుగు లేదండీ. మీరు వ్రాయడమూ అట్లాగే వుంది, వాళ్లు అచ్చు వేయడమూ అట్లాగే వుంది. అన్నీ అటికిపోయినై......మొత్తంమీద అన్నీ శతమానం దాటినై అనుకుంటూ......

అందులో సగం తమరివేనండి.

కాదుమరి—అయినవాటిల్లోను, కాని వాటిల్లోనూ కూడా నన్ను యిరికిస్తూంటే.

పేరు చిరస్థాయిగా ఉంటుంది, పో.

ఇప్పడదే బెంగ.........ఎట్లా ఉంది, టీ?

రోజ్ పీక్ ఆ.

అవును. అది తెప్పించ మంటిరిగా?

సరే గాని, చూడు, మరచిపోయాను. రావు టీకి వస్తాన్నాడు.

టీకిగూడా వారాలు చెప్పకుంటున్నాడా యేం?

పోనిస్తూ. రామూని టీ సిద్ధంగా ఉంచమను. అతను వచ్చే వేళైంది.........అదిగో డాక్టరు గారి భార్య వచ్చినట్టుంది నీకోసం, వెళ్లు...

౬

ఏమండీ, యీవేళైనా పట్టుకొచ్చారా?

ఏమిటి బాబు?

ఎంతతిన్నా పరగడుపైనట్టుగా, ఎన్నిసార్లు చెప్పినా కొత్తే. పేపర్ ప్లవర్సును, పటం కుట్టేటందుకు చంకీను తీసుకురమ్మంటిని గాదండీ?

సాహేబుసంపాదన బూబు కుట్టుపోగులకు సరిట. ప్రస్తుతం మన ఆర్జనంతా యీవిధంగా అయినదానికి కాని దానికి వ్యయం. ఏమన్నా అంటే నోట్లో......

అంతా చిత్రమండీ మీది. చెయ్యమనేది మీరే, చెప్పమనేది మీరే. చివరకు మాటలు నాకు. మొన్నే గా మీరు పదహారురూపాయలు పెట్టి పెద్ద గజు ఫ్లవర్ వాజు కొనుక్కొచ్చారు. పొరబాటున చిల్లు మంటే ఎంచక్కా కాకుండా రూపాంతరం పొందుతుంది.

సరే, ఏముంది? నిన్ను నేననా, నన్ను నీవనా. మొత్తానికి యిద్దరం కలిసి సంసారాన్ని చక్కబెడుతున్నా మన్న మాట.

ఇదిగో ఏమండోయ్ చూచారా. ఈకిటికీ దగ్గర ప్రాకించిన సన్నజాజి ఎంతలో పైకి వచ్చిందో. సరిగ్గా యిక్కడే పడక, పైన జాజి పొద. ఎల్లా వుండంటారు?

అనేదేమిటి; శేషశాయికి మూడింతలు పైగా వుంటే.

మొత్తానికి కవితాశక్తి, ఊహ, వ్యర్థం కాని చ్చా కాదు.

చెప్పవ్. టెస్టిమోనియల్ యిచ్చావుగద.

ఆమాత్రం తెలివే వుంటే మీ రిట్లా అంటారు ...ఇదిగో, ఏమ డోయ్, మరచి పోయినాను. ఒక్క క్షణం కళ్లు మూసుకోండి తమాషా చూపిస్తా...

చంపావ్, పో వేగిరం కానీ.

ఇప్పుడే అయిదు నిముషాల్లో వస్తాను......అదిగో కళ్లు తెరుస్తున్నారు. నేను వొప్పుకోను. ఊహు హుడావిడి. ఎవరు తెరిచారు?

ఊఁ. ఇప్పుడు చూడండి!

నువ్వేనా, చిన్నీ......ఎక్కడిది. నిజంగా చుక్కలమధ్య చంద్రుడల్లే వున్నావు. వొట్టు...అయ్యో, మీవొట్టు బంగారంగారు. నేను కాదన్నానటండీ...మాఅమ్మ కొని పంపించింది.

ఏదీ, యిల్లా రా, చూస్తాను. కొంచెం పెద్ద పువ్వల్లే వుందే?

మరీ అంతపెద్దది కాదులెండి. ఉన్నది సామాన్యంగానే. సిల్కు గూడా మంచిదే. ఏమంటారు.

అవునవును. చాలామంచిది.

ఎప్పుడేనే మీచేత్తో మీరు యిటువంటి దొకటి......

కొనలేదూ? ఎందుకు పక్షపాతం......పోనీ లేగని, అదేమిటి బుగ్గపైన. ఇట్లా రా.

ఉంటే వుంది లెండి, నే రాను. మీయెత్తు నాకు తెలుసు.

ఎబ్బే. నిజంగా. ఉండు. ఇదిగో......

అబ్బ ఏమిటండీ, మోటుతనం. చీరెంతా నలిగిపోయె. ఉండండి. అన్నిటికీ తొందరే.

---